# థర్డ్ డిగ్రీ

అదొక చిన్న సంఘటన. కానీ, ఇందిరాపార్కు పక్కనుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డుకి వెడుతున్న రాజమార్గంలో, అదీ కల్లుపాక దగ్గర నలభై, యాభై మంది మనుష్యులు గుమిగూడాలంటే దానికి ఒక గొప్ప సంఘటనే కారణం కానక్కరలేదు. ఒక అంబాసిడర్ కారు, చెవులు చిల్లులు పడేలా మ్రోత మోగిస్తూ వచ్చిందే అనుకోండి, ఆ వాహనాన్ని రాజమార్గం ప్రక్కన ఆపి, బోనెట్ తెరిచి అక్కడా ఇక్కడా ముట్టుకోవడం, లాగడం చేసినా కానీ, దీర్ఘమైన ఆ చావుకేకకి విరామం లేకపోవడంతో, ఆ వాహన యజమాని-కమ్-సారథి రెండు చేతులతో తన ఏకైక బట్టతల బద్దలైపోకుండా గట్టిగా పట్టుకొని నిలబడతాడు. ఆ శబ్దాయమానమైన సందర్భంలో, రెండు మూడు డజన్ల మానవులు అక్కడ గబగబా గుమిగూడతారు. వాళ్ళల్లో ఒకరో ఇద్దరో బుద్ధిరాక్షసులు, ఏవో వైర్లు పీకేసి, ఆ శబ్దకాలుష్యానికి జనగణమన పాడగలిగారంటే దానిలో ఆశ్చర్యానికి ఆస్కారం లేదని చెప్పడం అతిశయోక్తి ఏమీ కాదు. మద్యపాన ప్రభావం మితిమీరి పోవడం వలన ఒక మోడరన్ పెయింటింగ్‌లో ఉన్న రేఖపై నడుస్తున్నట్లు, ముందుకు పోతున్న ఒకడు ప్రపంచంలో ఉన్న వాళ్ళనీ, అందరినీ బూతులు తిడుతూ, రోడ్డుప్రక్క ఒకచోట తన బెడ్‌రూమ్ ఏర్పాటు చేస్తే, ఆ వినోదదర్శన ప్రాప్తి కొరకు, అక్కడ జనం గుమిగూడటం మానవ సహజమైన ఒక ప్రవీణతకు, ప్రావర్తిక సాక్షాత్కారంగా ఉంటుంది. ఉదాహరణలు ఎందుకు ఎక్కువివ్వాలి? రెండు సారమేయ దంపతుల సాంగ్య దృశ్యవీక్షణోత్సుకులైన కుర్రవాళ్ళు, వెట్టివాళ్ళు రెండు మూడు నిముషాలపాటు తమ ప్రయాణానికి మధ్యలో విరామం ఇవ్వడం సర్వసాధారణమే కదా!

ఇక్కడ జరిగిన లఘు సంఘటన ఏమిటని చూద్దాం.

దాదాపు పదిహేడు, పదునెనిమిది సంవత్సరాలున్న ఒక అబ్బాయి, ఒక పాత సైకిలు తొక్కుతూ, రోడ్డుకి ఎడమ ప్రక్కన మెల్లగా వెళుతున్నాడు. అతని పేరు దుర్గయ్య. చిన్న కొట్లో పనిచేస్తున్న అతను, యజమాని నిర్దేశానుసారం ఎక్కడికో వెళుతున్నాడు.

ఆకస్మికంగా, ఆ సంఘటన జరిగింది.

ఎదురుగా, ముప్పై అయిదేళ్ళున్న ఒక ధృడకాయుడు, విమానవేగంతో సైకిలు తొక్కుకుంటూ వచ్చి, దుర్గయ్య సైకిలుని గుద్దడంతో, వారిద్దరూ కిందపడిపోవడం, దురదృష్టకరమైన సంఘటన అయినా కూడా, వారిద్దరికీ ఎటువంటి గాయాలు కానీ, దెబ్బలు

కానీ తగలలేదు. రోడ్డు ప్రమాదాల్లో ఎన్నెన్ని ఘోరాలు జరిగిపోతున్నాయి! వీళ్ళిద్దరూ సైకిళ్ళతో సహాపడిపోయిన సమయంలో వెనుక నుంచి ఒక మోటారు వాహనం కొంచెం వేగంగా వచ్చి ఉంటే, వాళ్లల్లో కనీసం ఒక్కడయినా చట్నీ అయిపోయేవాడు. అంత జరగకపోయినా, రోడ్డుమీద పడిపోయేటప్పుడు, తల నేలకి తగిలినా పెద్ద అపాయమే. లేకపోతే, ఏ చెయ్యో, కాలో విరగడానికి ఈ ఏక్సిడెంట్ చాలు. ఇద్దరూ కూడా వెంటనే లేచి నిలుచున్నారు. దుర్గయ్య, తన సైకిలుని పైకి లేపబోయాడు. చిన్న గడ్డం పెంచుకున్న బలమైన కండరాలు గల రౌడీలాంటి రెండో సైకిలువాడు, తన ద్విచక్రిని ఉద్ధరించడానికి ప్రయత్నించకుండా ఉర్దూలో పులిసిన తిట్లు తిడుతూ, దుర్గయ్యని కొట్టడం ప్రారంభించాడు. రెండు చేతులూ జోడించి, ఆ ఉగ్రనరసింహుడికి నమస్కారం పెట్టి, క్షమ యాచిస్తున్న ఆ కుర్రవాడిని, అతను నిర్దయగా ప్రహరించడం కొనసాగించాడు. “నేనేమీ తప్పు చేయలేదే” అంటూ ఏడుస్తున్న దుర్గయ్య వీపు వంచి దభీ దభీమని గుద్దుతూ, ఆ రౌడీ, అతని తల్లిదండ్రుల గురించి ఉర్దూలో విశేష పదప్రయోగాలు కూడా వాడాడు. చుట్టూపోగయిన మనుష్యుల శరీరాలకి గానీ, మనసులకి గానీ, ఎలాంటి నొప్పి కూడా కలగలేదు. వాళ్ళకి, అది టిక్కెట్టు అవసరం లేని ఒక వినోద దృశ్యం మాత్రమే. అయినా వాళ్ళల్లో, కొంతమందికి ఆ రౌడీ క్రూరత్వం నచ్చలేదు. కానీ, ప్రతిఘటించడానికి, వాళ్ళ ఎముకలేని నాలుకలకు బలం చాలలేదు.

ఈ లోపల ఒక పోలీసు జీపు అక్కడికి వచ్చి ఆగడం, ఆరడుగుల ఇన్స్‌పెక్టర్ ఆ సంఘటనకి ప్రత్యక్ష సాక్షి కావడం ఎవరూ గమనించలేదేమో! అతను వేరెవరో కాదు... మా ఇన్స్‌పెక్టర్ ఖాన్‌సాబే! జనాన్ని పక్కకు తోసి, రంగప్రవేశం చేసిన ఆ ఇన్స్‌పెక్టర్, బూతులు గర్జిస్తున్న ఆ సింహాన్ని... మనిషి మాంసం కొరుక్కుతింటున్న ఆ రౌడీ మృగాన్ని. షర్ట్ కాలర్ పట్టుకొని, పైకి లేపి ఉర్దూలో అడిగాడు. “ఇక్కడ ఏమి జరుగుతోంది?”

“సైకిలు నడపడం చేతగాని ఇతను, నా సైకిలును గుద్దేసి, నన్ను కింద పడేసాడు.” అని రౌడీ చెబుతుండగా,

“నేను కావాలని తప్పు చేయలేదు సార్!”

“నువ్వు చెప్పేది నిజమే. నువ్వు రోడ్డుకి ఎడమ ప్రక్కనే నడిపించావు కదా! ఈ పందినాకొడుకు రాంగసైడు నుంచి వచ్చాడు.” అని ఆ ఇన్స్‌పెక్టర్ దుర్గయ్యని ఓదార్చాడు.

“ఈ సైకిలు నడపడానికి కూడా కుడీ, ఎడమా అంటూ ఉంటాయా! కాస్త జాగ్రత్తగా నడపాలి,” అంటూ రౌడీ తనని తాను సమర్థించుకున్నాడు.

“ఒళ్లు పెంచినంతమాత్రాన సరిపోదురా! తలలో కూడా ఏదయినా ఉండాలి.

ఇరవై సంవత్సరాలుగా ఈ డిపార్ట్‌మెంట్లో పనిచేస్తున్న నాకు, ట్రాఫిక్ రూల్స్ కొత్తగా నేర్పిస్తున్నావా, బ్లడీఫూల్!" అని అడుగుతూ, ఆ ఇన్స్‌పెక్టర్, రౌడీ షర్టుముందు భాగం తన పిడికిట్లోకి తీసుకొని అతన్ని కుదిపాడు.

"నేనెవరికీ నేర్పించడానికి ప్రయత్నించటం లేదు" అని ధైర్యం విడనాడకుండా రౌడీ గొణిగాడు.

"ఈ రెండు సైకిళ్ళు ఒకదాన్నొకటి గుద్దుకుని మీరు ఇద్దరూ కిందపడ్డారు. ఇతనయితే ఏ తప్పూ చేయలేదు. అయినా నువ్వెందుకితన్ని ఇంత ఎక్కువగా బాదావు?" ఇన్స్‌పెక్టర్ అడిగాడు.

"నాకు కోపం వచ్చినందుకు.." ఈ

"ఇప్పుడు, నాకు నీమీద కోపం వస్తోంది...."

"కొట్టండి, సార్... మీచేతిలో జిల తగ్గేవరకూ కొట్టండి."

"రౌడీ కావడం వలన నువ్వేదయినా చేయగలవు. కానీ చట్టాన్ని రక్షించే పోలీసు అధికారిగా రౌడీలా ప్రవర్తించడం నాకు సాధ్యం కాదు. అందుకే, మరో దారేదయినా చూడాలి. సరే, ఇంతకీ నీపేరేమిటి?"

"సికిందర్...."

"ముకద్దర్ కా సికందరా?"

"కాదు, సికందర్ పాషా"

"ఇది నీ అసలు పేరేనా?"

"టాంక్‌బండ్ పక్కనున్న సికందరాబాదంత నిజం."

దుర్గయ్యను కూడా పేరడిగి కనుక్కున్న తరువాత,

"దుర్గయ్యా! ఈ పాషా నిన్ను బాగా కొట్టాడా?" అని ఇన్స్‌పెక్టర్ అడిగాడు.

"పట్టి కొట్టడమయితే పర్వాలదు, సార్! కానీ, నా వీపు వంచి గుద్దడంతో, క్షయ రోగం వస్తుందేమోనని నాకు భయమేస్తోంది." ఏడుపుని అణచుకోలేకపోతూ చెప్పాడు దుర్గయ్య.

"ఆ భయం నీకు అక్కర్లేదు. నీకటువంటి రోగమేమీ రాకుండా, నేను మందు లిప్పిస్తున్నాను. కానీ, నీకు దొరికినదంతా ఇతనికి తిరిగి ఇవ్వాలి."

"వద్దు, సార్.... వద్దు ఎవర్నయినా కొట్టడం, తన్నడం నా వల్లకాదు."

"వాడి చెంపలు రెండూ వాయించరా?" అన్న ఇన్స్పెక్టర్ గర్జన విని, దుర్గయ్య వణికిపోయాడు. బుగ్గలమీద ఉన్న దుమ్మును తుడుస్తున్నట్టు, సుతారంగా కొట్టాడు. పాషా పెద్దగా నవ్వాడు.

"దుర్గయ్యా! ఇతన్ని నవ్వించడానికా, నువ్వు కొట్టింది. గట్టిగా రెండు తగిలించు. ఈ పట్టపగలే అతనికి నక్షత్రాలు కనిపించేలా కొట్టు... కొట్టమంటే!" ఇన్స్పెక్టర్ మళ్ళీ గర్జించాడు.

దుర్గయ్య మళ్ళీ వణికాడు... మళ్ళీ దుమ్ము తుడిచాడు. పాషా మళ్ళీ నవ్వాడు.

"ఛీ..ఛీ.. ఇతనికి నవ్వించడం మాత్రమే తెలుసు. మీలో ఎవరయినా ఇతనిని చితకబాదగలరా? దమ్మున్న మగాడెవరయినా ఉంటే, దుర్గయ్య చెయ్యలేని సత్కారం అతను చెయ్యవచ్చు." అక్కడ చేరిన గుంపు నుద్దేశించి, ఇన్స్పెక్టర్ ఖాన్ చెప్పాడు.

పహిల్వాన్ లాంటి వాడొకడు ముందుకు వచ్చాడు. దొరిని అవకాశం వదులుకోకుండా, తనకి తెలిసిన విద్యలన్ని పాషామీద ప్రయోగించాడు. పాషా వీపు వంచి, ప్రచండ ప్రహారాలు వర్షింపచేస్తుంటే, ఇన్స్పెక్టర్ ఖాన్ అతన్ని ఆపాడు. పాషా నవ్వనూ లేదు, ఏడవనూ లేదు. దెబ్బలు ఇచ్చిపుచ్చుకోవడం అలవాటయిన అతని ముఖంలో, నొప్పి భరిస్తున్నటువంటి ఏ భావం కనిపించలేదు. "నిన్ను తర్వాత చూసుకుంటాన్రా", అని అతన్ని పాషా బెదిరించినప్పుడు, యముడికి దళారిలాంటి ఆ వస్తాదు వెటకారంగా నవ్వాడు.

"పాషా! నువ్వు ఇతన్ని తాకటమంటూ జరిగితే, అది నేను పెన్షన్ తీసుకున్న తర్వాతే. అర్థమయిందా! నడు, జీపులో ఎక్కు."

"మరి, నా సైకిలు" పాషా అడిగాడు.

"అది దానంతటఅదే స్టేషన్‌కి వచ్చేస్తుంది." అంటూ పాషా షర్టు కాలర్ పట్టుకుని, జీపులోకి ఎక్కించి, జీప్ డ్రైవర్‌కి ఏదో చెప్పాడు. అతను, గుంపులోని ఒక వ్యక్తికి, పాషా సైకిలుని స్టేషన్‌కు చేర్చే బాధ్యత అప్పజెప్పాడు. జీపు ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌వైపు రయ్యిన వెళ్ళింది.

మంచి కాయబలం గల ఆ ఇన్స్పెక్టర్, తన ఔద్యోగిక జీవితంలో ఒక్కడినయా కొట్టలేదంటే, ఎవరయినా నమ్ముతారా? కాగా కసరత్తుచేసి, పుష్టిగా భోంచేసి అతనికి, తన చేతుల గురించి మహాభయం. తన బాహుబలం కారణంగా ఎవరూ చనిపోగూడదని,

లేదా ఆసుపత్రి పాలవకూడదని అతనికి ఉండేది. అందుకే, ఎవరయినా దొంగని కానీ, బందిపోటుని కానీ, ఇంటరాగేట్ చేసేటపుడు, ఒక గూండాని కానీ, వీధి రౌడిని కానీ, ఆడవాళ్లని అల్లరి పెట్టేవాళ్ళని కానీ, మర్యాద చేసేటప్పుడూ, చేతులు దురద ఎక్కువగా ఉన్న పోలీసు వాళ్ళకి, ఆ పని అప్పజెప్పేవాడు. పోలీసులందరూ, మహాత్మాగాంధీగారి అహింసా సిద్ధాంతంపట్ల విశ్వాసులుగా ఉండాలని భాషణం ఇచ్చేవాళ్ళ గురించి, అతనికి ఏమాత్రం సదభిప్రాయముండేది కాదు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కొంత మంది పెద్ద అధికారులు ఈ విధంగా మాట్లాడటం విని, ఇలాంటి వాళ్ళు డిపార్ట్‌మెంట్‌ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నారా అని అతను పళ్ళు కొరికేవాడు. మానవ చరిత్రారంభం కాలం నుంచి ఏదో రకమైన సామ, దాన, భేద, దండ సిద్ధాంతాలను, కపాల గర్భంలో బంకమట్టిలేని వాళ్ళందరూ విశ్వసించేవారు. భారతదేశంలోని పోలీసువాళ్ళు, తమ కర్తవ్య నిర్వహణలో నూటొక్క శాతం అపజయం పొందాలనే సదుద్దేశంతో, బ్రిటిష్‌వాళ్ళు రాసిపెట్టిన చట్టాలని అక్షరాలా పాటించాలనే అభిప్రాయం ఉన్నవాళ్ళు. ప్రజాక్షేమాన్ని గాలిపటంలా ఎగరేసే వాళ్ళని అతని అభిప్రాయం. "కర్రని వదిలిపెట్టు, కుర్రాడ్ని పాడుచెయ్యి" అని చెప్పిన అదే ఇంగ్లీషువాడు, దొంగనీ, రౌడీనీ, హంతకుడినీ, బలాత్కారం చేసేవాడినీ, వాళ్ళందరినీ ముట్టుకోకూడదనీ, ఆంక్షలు విధించాడు.

ప్రపంచమంతటా, మరణశిక్ష లేకుండా చేయాలనీ, వాదనలు పెరుగుతుంటే, బలాత్కారపు కేసుల్లో, సరయిన సాక్ష్యాలు లేకున్నాసరే, ఫిర్యాదీ చేసే ఆరోపణపై మాత్రం, అపరాధులకు ఉరితాడు తగిలించాలని, స్త్రీ పక్షపాతులైన కొంతమంది నియమనిర్మాతలు డిమాండ్ చేస్తున్నారు. ఇంగ్లీస్‌లో "మేక్‌లవ్" అంటే, "రతిక్రియ చేయుట" అని అర్థం. ఆ విధంగా ప్రేమించడం, అమ్మాయి ఇష్టప్రకారంగా కాకపోతే అది బలాత్కారమనే నేరమవుతుందని చట్టం చెబుతోంది. అలాంటి బలవంతపు ప్రేమకి, వధ శిక్ష విధించాలని మన ప్రతినిధుల్లో కొందరు గొంతులు చించుకుంటున్నారు. అటువంటి స్త్రీ పక్షపాతుల్లో కొంతమంది, స్త్రీలకు అసెంబ్లీలలో, పార్లమెంటులలో ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రతిపాదనను ఏవో కారణాలు చెప్పి వ్యతిరేకిస్తున్నారు. ఏసుక్రీస్తు ఇచ్చిన ఉపదేశాలలో కనీసం ఒక్కటైనా మనసా వాచా కర్మణా ఆచరించాలనే ఉద్దేశ్యంలో ఒక యువకుడు, తన పక్కింటమ్మాయిని మనస్ఫూర్తిగా ప్రేమించి, ప్రేమించి, ఒకరోజు "మేక్‌లవ్" ప్రోగ్రాం జరుపుతున్నప్పుడు, అది దుర్వాసుడు లాంటి ఉగ్రకోపి అయిన ఆ అమ్మాయి తండ్రి చూసి, ఆ అనౌపచారిక కాముకుడిని పోలీసుల ఎలకబోనులో పెట్టిస్తే, అతనికి పడాల్సిన శిక్ష మరణపాశమా? లేక వరణమాల్యమా? ముందటి రోజుల్లో, ఒక బలాత్కారం జరిగిందంటే, అమ్మాయిలు చెడ్డపేరు వస్తుందనే భయంతో దాన్ని బయటపెట్టేవారు కాదు. కలియుగం

బాగా ముదిరిన ఈ రోజుల్లో, పురుషుడి స్పర్శ అయినా తగలకుండా, బలాత్కారం జరిగినట్టు ఫిర్యాదివ్వడానికి కొంతమంది స్త్రీలు ఏమాత్రం వెనుకాడరు. ఇది ఈ కలికాలపు ప్రభావం కాక మరేమనుకోవాలి?

మానవ సముదాయంలో రకరకాల బలప్రయోగాలు జరుగుతూనే ఉంటాయి. అది పోలీసుల వైపు నుంచి జరిగినప్పుడు, దాన్ని థర్డ్‌డిగ్రీ అంటారు. ఇన్స్‌పెక్టర్ ఖాన్‌కు, ఉద్యోగంలో ఉండగా థర్డ్‌డిగ్రీ సంపాదించే ఐ.పి.యస్. ఆఫీసర్ల మీద సదభిప్రాయముండేది కాదు. మామూలుగా బియ్యే తర్వాత ఎమ్మే లేదా బియ్యెస్సి తరువాత ఎమ్మెస్సీ అనే రెండు బిరుదులు సంపాదించిన తరువాతే చాలామంది ఐ.పి.యస్.లోకి వస్తారు. రిటైర్మెంట్ దగ్గరపడినకొద్దీ, కొంతమంది ఆదరాబాదరాగా ఒక న్యాయశాస్త్ర పట్టా సంపాదిస్తారు. పోలీసు శాఖ గుట్టు మట్లు తెలిసిన వీళ్ళు పోలీసులకి ప్రతికూలంగా, దొంగలకి అనుకూలంగా, న్యాయ స్థానాల్లో నల్లకోటు వేసుకుని, నల్లడబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. వీళ్ళకు సిగ్గులేనే లేదా? ముప్ఫై అయిదు సంవత్సరాలపాటు ఏ డిపార్ట్‌మెంట్ ఉప్పు తిన్నాడో, దానికి వ్యతిరేకంగా వజ్రాయుధం ప్రయోగించడానికి వీళ్ళకు మనసెలా ఒప్పుతుందో! ఉద్యోగకాలమంతా, రాజకీయాల్లో ఉన్న వాళ్ళని విమర్శించడం, బూతులు తిట్టడం చేసే కొంతమంది ఐపియస్ వాళ్ళు, ఉద్యోగ విరమణ దగ్గరపడినప్పుడు కానీ, విరమణ అయినప్పుడు కానీ, ఉద్యోగకాలమంతా, "లాస్ట్‌రిసార్ట్ ఆఫ్ ఎ స్కౌండ్రల్" అని వాళ్ళు వర్ణించే వృత్తిని, ఆలింగనం చేసుకోవడానికి సిద్ధపడతారు. ఆవిధంగా, పాలిటిక్స్‌లో దూరినపుడు, ఈ పార్టీ ఆపార్టీ అనే భేదమేమీ ఉండదు. కుటుంబ చరిత్ర కానీ, వధువు అందం, గుణం ఏమీ చూడకుండా, కేవలం కట్నం కోసమే పెళ్ళి చేసుకొనే కార్యక్రమం లాగా ఉంటుంది. వీళ్ళు రాజకీయమనే రొంపిలోకి వేసే కప్పగంతు. వీళ్లల్లో కొంతమంది, రిటైర్‌మెంట్ దగ్గరపడినప్పుడు, వాళ్ళు పుట్టిన తేదీ ఇంకా ముందుకు జరపడానికి న్యాయస్థానాలని ఆశ్రయిస్తారు. దానికి ఒక సంవత్సరం తర్వాతే, వారి వివాహం జరిగిందనీ, అందుకే రెండు సంవత్సరాలు ముందుకు పొడిగించాలని ఒకరి వాదన. ఉద్యోగంలో అడుగుపెట్టేముందు, ఇలాంటివాళ్ళకు, తమ "ఇయర్ ఆఫ్ మాన్యుఫాక్చర్" తెలుసుకోవాల్సిన కనీసపుటాలోచన లేదా? పరీక్ష దరఖాస్తులో పుట్టిన తేదీ వాళ్ళే స్వయంగా రాస్తారు కదా! ప్రభుత్వం ఇష్టానుసారంగా ఈ ఆఫీసర్ల వయసేమీ నిర్ణయించడం లేదు. అందుకే, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్టులో నమోదు చేయబడిన పుట్టిన తేదీ మార్చడానికి ప్రభుత్వం ఎప్పుడూ ఒప్పుకోకూడదు.

సాధారణంగా పెద్ద పెద్ద ఆఫీసర్లకు ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలుంటారు. వాల్లల్లో మగపిల్లలని బాగా చదివించి, డాక్టరో, ఇంజనీయరో, ఎం.బి.ఎనో, ఐ.పి.ఎస్సో, ఐ.ఏ.ఎస్సో

చేయాలని తల్లిదండ్రులు ఆరాటపడతారు. దీనికి విరుద్ధంగా కొందరు ఉన్నతాధికారులు, తమ మగపిల్లలని బిజినెస్‌లోకి దింపారంటే, ఉద్దేశం స్పష్టం - అధికార తండ్రి పోగుచేసిన నల్లడబ్బును, అనధికారి కొడుకు ద్వారా తెల్ల డబ్బుగా రూపాంతరం చెయ్యడమే.

ఇన్ని వైవిద్యాలు గల అభిప్రాయాలు పెట్టుకోవడానికి ఇతనెవరు? సుప్రీంకోర్టు జడ్జా? కేవలం, ఒక ఇన్స్‌పెక్టర్ అయిన ఈ ఖాన్, పై ఆఫీసర్లగురించి ఇలా విమర్శలు చేయడం, అతని తలపొగరు కాక మరేమిటి?

పాపం, అతనెవర్నీ విమర్శించలేదు. ఎవరికయినా కానీ, తనకంటూ కొన్ని ఆలోచనలూ, అభిప్రాయాలూ ఉండటం స్వాభావికం. అమెరికా ప్రెసిడెంట్ క్లింటన్ గురించి, రెండు రకాల అభిప్రాయాలు వెలిబుచ్చే వర్గాలు ఈ ప్రపంచంలో ఉన్నాయి కదా! వాళ్ళల్లో ఎవ్వరూ క్లింటన్‌కి గానీ, మోనికాకి గానీ, బావమరుదులు కారే, ఈ ప్రజాస్వామ్య యుగంలో ఎవరు ఎటువంటి అభిప్రాయం కలిగి ఉన్నా అభ్యంతరం ఉండకూడదు. మనస్సులో కలిగే ఆలోచనలకి, పన్నుకట్టడం అవసరం లేదు కదా! మన ఖాన్‌కు, తన అభిప్రాయాలను అందరిముందూ వడ్డించే అలవాటు లేదు. డిసిప్లిన్ విషయంలో అతను, ఇతర పోలీసాఫీసర్లకు ఒక ఆదర్శం.

స్టేషన్‌కు వచ్చిన తరువాత, పాషాను లాకప్‌లో పెట్టారు. స్టేషన్‌లో ఉన్న ఇద్దరు సబ్ ఇన్స్‌పెక్టర్లకు, పాషా చేసిన వీరకృత్యం గురించి వివరిస్తూ...

"ఇలాంటి రౌడీ చేతిలో ఏ పేదమ్మాయో ఇరుక్కుంటే, ఇతను ఊరికే వదిలి పెడతాడా?" అని ఇన్స్‌పెక్టర్ ఖాన్ రిమార్క్ చేశాడు.

"సాబ్! అది నేనొక్కడినే చెయ్యలేదు. ఆటో రిక్షాలో ఆమెను తీసుకొచ్చేది రాముడు. దానికి అతనడిగిన డబ్బును కూడా నేనిచ్చేశాను." అని పాషా భుజాలు తడుముకున్నాడు.

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఇరవై రోజుల క్రితం, రిపోర్టు చేయబడిన సాక్ష్యాధారాలు ఏమీ లేని ఒక గాంగ్ రేప్‌కేస్ ఈ విధంగా డిటెక్ట్ చేయబడింది.

"వెల్‌డన్ ఇన్స్‌పెక్టర్ ఖాన్!"